పసిప్రాణం..పోషక లోపం

- అంగన్‌వాడీల్లో నాణ్యత లేని పదార్థాల సరఫరా
- పిల్లల బరువు, ఎత్తులో వ్యత్యాసాలు
- వెంటాడుతున్న పౌష్టికాహార లోపం
- తల్లిదండ్రుల్లో లోపిస్తున్న అవగాహన



ఉరవకొండ: బాల్యం బలహీనమవుతోంది..పసి ప్రాణం పోషకలోపంతో అలమటిస్తోంది..బాలింతలు, తల్లులు అనారోగ్యానికి గురవుతుంటే.. సంబంధిత శాఖల సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తోంది.. పేరుకు మాత్రమే పౌష్టికాహార కేంద్రాలని చెప్పుకుంటున్నా.. అందులోని పిల్లలు, తల్లులు, గర్భిణులు పోషకలోపంతో బాధపడుతున్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం తర్వాత మాతాశిశువు ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా..ఆచరణలో మాత్రం ఫలితం కనిపించలేదు. కేవలం ప్రచారంతోనే సరిపెడుతున్నారు.. పౌష్టికాహార లోపంతో ఎత్తుకు తగిన బరువు, వయస్సుకు తగిన ఎత్తు లేని పిల్లలు అధికంగా కనిపిస్తున్నారు.

- ఉరవకొండలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో మూడేళ్ల చిన్నారి బరువు 9 కేజీలు, ఎత్తు 60 సెం.మీ మాత్రమే ఉంది. సాధారణంగా ఆ వయస్సున్న పిల్లలు 14 కేజీల బరువు, 98.8 సెం.మీ ఎత్తు కలిగి ఉండాలి. ఇది ఒక్క ఉరవకొండ అంగన్‌వాడీ కేంద్రంలోనే కాదు.. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, కంబదూరు, కణేకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని ఉన్న పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు అధికంగా ఉన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది చెప్తున్నా.. వాస్తవపరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఉరవకొండ, కణేకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 925 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 22,481 మంది ఉండగా, 10,200 మంది ఎత్తు తక్కువగా ఉన్నారు. 12,782 మంది పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారు.



ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా వివరాలు ఇలా:

ప్రాజెక్టు	అంగన్‌వాడీలు	07-3 సం.పిల్లలు	3-6 సం. పిల్లలు
ఉరవకొండ	325	12.027	6.118
రాయదుర్గం	185	8.998	5.571
కణేకల్లు	138	1.200	3.000
కళ్యాణదుర్గం	79	4.455	2.968
కంబదూరు	198	5.907	4.824
మొత్తం	925	32.587	22.481

ఎత్తు బరువు తూనిక:

పిల్లల ఎత్తు, బరువు తెలుసుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పరికరాల ద్వారా తూనిక వేస్తారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంటుంది.

అంగన్‌వాడీలకు నాణ్యత లేని సరుకులు:

చిన్నారుల్లో పౌష్టికాహారం లోపించడానికి అంగన్‌వాడీలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పాలు, గ్రుడ్లు నాణ్యత లేకపోవడమే అన్న విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి. పాలు నాణ్యత లేకుండా మరిగించే కొద్ది సేపటికే వాసన వస్తోందని అంగన్‌వాడీలు సీడీపీఓ, సూపర్‌వైజర్లకు ఫిర్యాదులు చేయడం పరిపాటిగా మారింది. దీంతో పాటు గ్రుడ్లు గోళి సైజులో ఉండి లోపల పచ్చ సొన చెడిపోయి ఉంటుందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. అంగన్‌వాడీలో వండిపెట్టే ఆకుకూరలు ఇవన్నీ వారం రోజుల నుండి నిల్వ ఉంచినవి సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పౌష్టికాహార లోపం, బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలను పౌష్టికాహార లోపం ఉన్నట్లు గుర్తించి, వారికి ప్రత్యేకమైన పౌష్టికాహారాన్ని అందిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే సరుకుల్లో ఏ ఒక్కటి నాణ్యతగా లేకపోయినా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని వెనక్కి పంపుతామన్నారు.

– శ్రీదేవి, సీడీపీఓ, ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు

క్లుప్తంగా

బీటీపీని సందర్శించిన ఆర్డీఓ



బీటీపీని పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

గుమ్మఘట్ట: ఎగువున ఉన్న కర్ణాటకలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో బీటీపీకి వరదనీరు చేరడంతో జలవనరుల శాఖ,రెవెన్యూ అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ వసంత బాబు సూచించారు. బీటీపీకి క్రమంగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో ఆయన బీటీపీని సందర్శించారు. అధికారులకు పలు సలహాలు,సూచనలు ఇచ్చారు. బీటీపీ నీటి నిలువ సామర్థ్యం 1,655 అడుగులు కాగా, ప్రస్తుతం 1,650.5 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 1,964 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు జల వనరులశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈఈ బలరాముడు, తహసీల్దార్ జిలాన్‌బాషా, ఏఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడి



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మజ

గుమ్మఘట్ట: ప్రకృతి వ్యవసాయం సాగుతో అధిక దిగుబడి సాధించొచ్చని ఏడీఏ పద్మజ తెలిపారు. మండలంలోని 75 వీరాపురం సమీపంలో ఆకుకూర, వేరుశనగ పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతంతో చీడపురుగుల నుంచి రక్షించుకోవచ్చని తెలపారు. పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఏలు గుమ్మఘట్ట నిర్మల్ కుమార్ ,రాయదుర్గం బాష, కణేకల్లు జగదీష్, బొమ్మనహళ్ సాయికుమార్, వీఏఏ, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలు, ఎంపీఈఓలు, ఆర్‌వైఎస్‌ఎస్ డివిజన్ ఇన్‌చార్జ్ భీమన్న , సీఆర్‌పీ రాజాం, పీఆర్‌పీ సత్యనారాయణ,ఎస్‌ఎఫ్‌ఐలు నవీన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ ప్రామాణికంగా బీమా చెల్లింపు

ఉరవకొండ రూరల్: ఈ క్రాప్ నమోదును ప్రామాణికంగా పరిగణించి, బీమా చెల్లింపు జరుగుతుందని ఏఓ రామకృష్ణుడు తెలిపారు. మంగళవారం లత్తవరం గ్రామ పరిధిలో 'పొలం పిలుస్తోంది ' కార్యక్రమం నిర్వహించారు. పంటల బీమా నమోదుకు ఈ నెల 14 వరకు అవకాశం ఉందని, పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,412 ఎకరాల్లో రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకున్నట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



శ్రీధరఘట్ట సచివాలయంలో అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

బొమ్మనహాళ్: సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు.

చెత్త నుంచి అదనపు సంపద

చెత్త నుంచి సంపద సృష్టిస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఉంతకల్లులోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్‌తో కలిసి పరిశీలించారు. సర్పంచ్ ముక్కన్న, పంచాయతీ కార్యదర్శులు పల్లవి, శివన్న, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆ భూముల్లో పంట పెట్టొద్దు

బొకుగుప్ప : జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీ ప్రాజెక్టుకు వెళ్లే కాలువ నిర్మాణ పనులకు సేకరించిన భూముల్లో పంటలు సాగు చేయొద్దని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మండలంలోని గంగవరం, దుద్దేకుంట, కోనంపల్లి గ్రామాల పరిధిలోని భూసేకరణ భూములకు ఇప్పటికే భూపరిహారం చెల్లించిందన్నారు.

కేటీఎస్ విద్యార్థినికి అభినందన

రాయదుర్గం: ఇటీవల విజయవాడలో సమాచార హక్కు చట్టంపై జరిగిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీల్లో రాయదుర్గం కేటీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఓమేశ్వరీవాణి ద్వితీయ స్థానంలో నిలవడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ కే లక్ష్మీనారాయణ అభినందించారు. మంగళవారం స్థానిక కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు విద్యార్థినిని సన్మానించారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులు పుల్లయ్య, పుష్పలతను సన్మానించారు. అధ్యాపకులు బాల నరసింహులు, బాబు, డీ నారాయణ, కోదండరాములు, విజయకుమార్, గోవర్ధన, పాలరాజు లక్ష్మీనారాయణ, జీసీవీ ప్రసాద్, వినోద్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

రాయదుర్గంలో చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సత్యనారాయణస్వామి గుడి సమీపంలోని వడ్డే అశోక్ అనే వ్యక్తి ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువా తాళం పెకలించి, రూ.1.50 లక్షల విలువ జేసే బంగారు సొత్తు ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు.

ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం

శెట్టూరు: సార్వత్రిక ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ములకలేడు, పెరుగుపాళ్యం గ్రామాల్లో ' రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో', బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, హామీలు, నయవంచనపై ప్రజలకు తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ఇళ్ల వద్దకే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వచ్చి పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు గుర్తు చేశారు. కూటమి ఏడాది పాలన పూర్తయినా ఒక్క పథకమైనా సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. అర్హులందరూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అనంతరం గ్రామ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి, కమిటీలు వేశారు.

గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నిక..

పెరుగుపాళ్యం గ్రామ అధ్యక్షుడిగా గొల్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా బోయ అశోక్, ప్రధాన కార్యదర్శులుగా రాధాకృష్ణ, మల్లేష్, మంజునాథ, కార్యదర్శులుగా రమేష్, చిత్తయ్య, అజ్జయ్య, మాబు, ములకలేడు గ్రామాధ్యక్షులుగా మన్సూర్, ఉపాధ్యక్షులుగా టీఎం ఈరన్న, ప్రధాన కార్యదర్శులు జీఆర్ బాబు, బలంపల్లి రామాంజనేయులు, వెంకటరమణ కార్యదర్శులుగా పుట్టీరప్ప, ఖరీం బాషా, తిప్పేరుద్ర, బాబులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి, పార్టీ అనుబంధ సంఘ నాయకులు నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, ఎంపీటీసీ మూర్తి, ములకలేడు నాయకులు నాయకులు రంఘనాథ, శ్రీనివాసులు, రాజన్న, తిమ్మప్ప, ఆనందమూర్తి, వన్నూరుస్వామి, లింగప్ప, మాబుసాబ్, నాగన్న, వెంకటరమణ, పెరుగుపాళ్యం నాయకులు గోవిందురాజులు, శివన్న, హనుమంతప్ప, గొల్ల గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ములకలేడులో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దేశభక్తిని పెంపొందించుకోవాలి



కూడేరు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కూడేరు: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సర్పంచ్ లలితమ్మ, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కేశవ తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉపాధి హామీ పథకం శాఖ ఆధ్వర్యంలో కూడేరు సచివాయలం-2 వద్ద వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ జండావిష్కరణ చేశారు. ఏపీఓ పోలేరయ్య, ఈసీ రాజేష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సచివాలయ, వెలుగు కార్యాయల సిబ్బంది పాల్గొన్నారు.

బొకుగుప్ప: మండల కేంద్రంలో అధికారులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో కలిసి తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం చేశారు. కార్యక్రమ ఇన్‌చార్జ్ దగ్గుపాటి సౌభాగ్య, ఈఓఆర్ డీ శివరంజని, ఏఎస్ఐ రామదాసు,ఆర్ఐ నగేష్ బాబు, నాయకులు దగ్గుపాటి శ్రీరాములు, జెట్టి గోపాల్, వన్నూరస్వామి, సుదీర్, హరినాథ్‌గుప్తా, మనోహర్, నుంకన్న, ధనుంజయరెడ్డి, శ్రీనివాస విద్యానికేతన్, సన్ రైజెస్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



బెకుగుప్పలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



శెట్టూరులో 80 అడుగుల జెండాతో ర్యాలీ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలో అధికారులతో కలిసి బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేశా రు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు తిరంగా ర్యాలీ చేశారు. తహసీల్దార్ సుమతి, ఎస్ఐ నరేంద్రకుమార్, డాక్టర్ రాజేష్‌కుమార్, విద్యాధికారి ఓబుళపతి, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, ముప్పూరి దేవరాజ్ పా ల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలో తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఈఓఆర్డీ రఘురాంరావు, ఎంఈఓ శ్రీధర్ విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం నిర్వహించారు.జెడ్పీహెచ్‌ఎస్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ఉపాధి ఏపీఓ నిరజ, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్లు సకాలం పూర్తి చేయాలి

రాయదుర్గంటౌన్: హౌసింగ్ లేవుట్లలో స్థలాలు పొంది రుణాలు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు, హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. లేనిపక్షంలో మంజూరైన గృహం పట్టా రద్దు చేయడం తోపాటు రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం వివిధ దశల్లో ఇంటి నిర్మాణానికి చెల్లించిన నగదు మొత్తాన్ని రికవరీ చేయబడుతుందన్నారు.

సింధూరం అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మంగళవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. సింధూరం అలంకరణలో అంజన్న భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సుప్రభాత సేవ, కుంకుమార్చాన, పంచామృతాభిషేకం, అర్చనలు, అభిషేకాలు చేసి, ఆకు పూజ, మహామంగహారతి ఇచ్చారు.



ఆంజనేయస్వామి



దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

సమయ పాలన కరువు

- ఇష్టారాజ్యంగా ఉద్యోగుల విధులు
- మధ్యాహ్నం 12 గంటలైనా ఖాళీగా కుర్చీలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయమే విధులకు హాజరుకావాల్సిన సిబ్బంది.. మధ్యాహ్నమైనా కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రజలు సమస్యలు చెప్పుకునేందుకు కార్యాలయానికి వస్తే .. అధికారులు, సిబ్బంది లేకపోవడం చూసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. రోజుల తరబడి ఇలాగే కొనసాగుతోందని ప్రజలు నిట్టూరుస్తున్నారు. కళ్యాణదుర్గం మండలంలో 17 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల నుంచి అధికారులు, సిబ్బంది మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. అయితే పంచాయతీల నుంచి మండల కేంద్రానికి ప్రజలు వచ్చినా, అధికారులు వచ్చినా ఇక్కడ ఖాళీగా కుర్చీలు దర్శనమిస్తుండడంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

'కూటమి' ఏర్పాటయ్యాక ఇష్టారాజ్యం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయంలోని సిబ్బంది.. ప్రజా సమస్యలు, పాలన గాలికొదిలేశారు. అధికారపార్టీ నేతల మెప్పు కోసం పాకులాడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల చిన్న పనులకూడా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఏ అధికారీ పట్టించుకోలేదు. సెలవు రోజుల్లో అధికార పార్టీ నేతల పనులు చేసి పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్‌ను ఫోన్‌లో సంప్రదించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.



కళ్యాణదుర్గం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 12 గంటలైనా ఖాళీగా ఉన్న కుర్చీలు

యువకుడి అనుమానాస్పద మృతి



కైలాష్ (ఫైల్)

రాయదుర్గం టౌన్: మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఓ చెట్టుకు వేసిన ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం బంజయ్యనగర్‌కు చెందిన కైలాష్ (19) అమ్మమ్మ, తాత ఇంట్లో ఉంటూ రాయదుర్గంలోని ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తున్నాడు. అతనికి అక్క, సోదరుడు ఉన్నారు. కర్ణాటకలోని కాలువపలిలో 18 ఏళ్ల క్రితమే తండ్రి నాగరాజు చేతిలో తల్లి ఓంకారమ్మ హత్యకు గురి కాగా, నాటి నుంచి అమ్మమ్మ, మేనమామ ఇంట్లోనే ఉంటున్నాడు. గత శనివారం మధ్యాహ్నం రాయదుర్గం మండలం మల్లాపురం నరసింహస్వామి గుడికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన కైలాష్..ఆ తర్వాత కనిపించలేదు. కుటుంబసభ్యులు, బంధువులు గాలించగా, అతని ద్విచక్ర వాహనం, చెప్పులు మాత్రమే కనిపించాయి. దీనిపై కుటుంబ సభ్యులు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం నరసింహస్వామి ఆలయ కొండ ప్రాంతంలో చెట్టుకు ఉరికి వేలాడుతున్న కనిపించాడు. స్థానికులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. బంధువులు, కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని మృతుడిని కైలాష్‌గా నిర్ధారిస్తూ బోరున విలపించారు. కాగా ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నులి పురుగులతో రక్తహీనత

కూడేరు: నులి పురుగులతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడి ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యాధికారిణి ఉషారాణి తెలిపారు. మంగళవారం నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 2-19 ఏళ్లలోపు 7,950 మందికి అల్బెండజోల్ మాత్రలు వేశారు. సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, సర్పంచ్ లలితమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 67 అంగన్‌వాడీ కేంద్రాలు, 56 ప్రభుత్వ పాఠశాలల్లో 0–19 ఏళ్లలోపు 12,170 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ , పీహెచ్‌సీ వైద్యుడు సందేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 9,562 మందికి అల్బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేశారు. వైద్యాధికారి అబ్బాల్, విద్యాధికారి ఓబుళపతి, సీహెచ్‌ఓ రాణీ ఎస్తేర్ , సూపర్‌వైజర్ రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు జాన్సన్, ఆనంద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఉరవకొండ రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యురాలు పావని తెలిపారు. మంగళవారం నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెచ్‌ఎం షకీలాబాను, హెల్త్‌సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, పీఈటీ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ విజేంద్ర తెలిఎలిపారు. మంగళవారం కళ్యాణదుర్గం ప్రభుత్వ కరణం చిక్కప్ప పాఠశాలలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోరంపల్లి పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ వంశీ, సిడిపిఓ లక్ష్మీప్రపన్న, డిగ్రీకాలేజ్ ప్రిన్సిపాల్ హర్షలత, అంజి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి పీహెచ్‌సీ తనిఖీ

కుందుర్పి: కుందుర్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనుపమ జేమ్స్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుందుర్పి మండలం నుంచి పలు ఫిర్యాదులు అందడంతో జిల్లా వైద్యశాఖ శాఖ స్పందించింది. కుందుర్పిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, డీవార్మింగ్‌పై అడిగి తెలుసుకున్నారు. తప్పకుండా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సిబ్బందికి ఏడీఎంహెచ్‌ఓ సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు తరుణ్‌సాయి, సోమేస్‌కుమార్ పారా మెడికల్ ఆఫీసర్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.



కుందుర్పి ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు డీఎంహెచ్‌ఓ అనుపమ జేమ్స్

డిమాండ్లు నెరవేర్చాలి



రాయదుర్గంలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 15 నెలలు గడిచినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని రాయదుర్గం ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు కెంచే లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డిపో గ్యారేజీ గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఎన్ఎంయూ జోనల్ సహాయ కార్యదర్శి షఫీ, రీజినల్ నాయకులు టీఎస్‌కే జిలాన్, రవి నాయక్, డిపో అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు గోవిందప్ప, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు దూదేపీరా, సతీష్‌కుమార్, డిపో చైర్మన్ కేవీఎస్ వలి, సత్తార్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉరవకొండ: ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. మంగళవారం ఉరవకొండ ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మ జ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. డిపో కార్యదర్శి నారాయణ స్వామి, డిపో అధ్యక్షుడు ఓబుళేసు, చలపతి మాట్లాడారు.

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ డిపోవద్ద ఉద్యోగులు మంగళవారం నిరసన తెలియజేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు ఇవ్వాలని, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంటి స్థలం కబ్జా

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో సర్వే నంబర్ 92లో తన రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని టీడీపీ నేత గౌరసముద్రం తిప్పేస్వామి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని బాధిత నిరుపేద మహిళ ఈరక్క వాపోయారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ సమీపంలోని క్రాస్ వద్ద ఇంటి పట్టాను గతంలో రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారని తెలిపారు. బేస్‌మెంట్ వరకూ నిర్మాణం చేపట్టిన తర్వాత ఆర్థిక స్థోమత లేక నిర్మాణం పూర్తి చేయలేకపోయినట్లు వివరించారు. ఈ స్థలంపై కన్నేసిన గౌరసముద్రం తిప్పేస్వామి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ ఆ స్థలం తనదేనంటూ బెదిరింపులకు దిగాడన్నారు. స్థలాన్ని కబ్జా చేసేందుకు టీడీపీ నేత వక్రమార్గాలు అన్వేషిస్తున్నట్లు కన్నీటిపర్యంతమయ్యారు. రెవెన్యూ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ జిలాన్‌బాషాను వివరణ కోరగా... గ్రామంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.